


ఖర్జూర పండ్లు కొనుగోలు చేస్తున్న ముస్లింలు



నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం

● నెల రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు ● ముస్తాబైన మసీదులు

సిద్దిపేట అర్బన్, మార్చి 11: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. సోమవారం నెలవంక దర్శనంతో రాత్రి ఇషా నమాజ్ తర్వాత ప్రత్యేక ప్రార్థనలు(తరావీ) చేశారు. మంగళవారం నుంచి నెల రోజులపాటు ఉపవాస దీక్ష (రోజా) పాటించనున్నారు. ఉపవాస దీక్ష పాటించే ముస్లింలు వేకువజామునే (సమయానుసారంగా) సహరీ తీసుకుంటారు. అప్పటి నుంచి మొదలుకొని సాయంత్రం సూర్యాస్తమయం వరకు ఎలాంటి ఆహార పానీయాలు తీసుకోకుండా కఠోర దీక్షలను పాటిస్తారు. తర్వాత (మగ్రిబ్) సూర్యాస్తమయం తర్వాత ఇఫ్తార్ చేసి దీక్షను విరమిస్తారు. రంజాన్ మాసం సందర్భంగా సిద్దిపేటలోని ప్రధాన మసీదుల వద్ద అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు. మసీదులను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. సోమవారం రాత్రి పలు చోట్ల తరావీ నమాజ్ పఠించారు. రంజాన్ సందర్భంగా ఖర్జురాలు, ఇతర పండ్లు విక్రయించే దుకాణాలు వెలిశాయి. కొన్ని చోట్ల హలీం తయారీ ప్రారంభమైంది.



ప్రత్యేక ప్రార్థనల కోసం ముస్తాబైన సిద్దిపేట పట్టణంలోని మసీదు



రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా హలీం విక్రయాలు

ఆ బ్యానర్లు ఎవరు కట్టారు?

● మావోయిస్టులా?.. ఆకతాయిలా?

● పెద్దమాసాన్‌పల్లిలో పర్యటించిన గజ్వేల్ ఏసీపీ

● భయాందోళనలో సమీప గ్రామాల ప్రజలు

తొగుట, మార్చి 11: సిద్దిపేట జిల్లా తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లి గ్రామ శివారులోని హెటిరో ఫార్మా కంపెనీ భూముల్లోని గోడలపై మావోయిస్టుల పేరుతో వెలిసిన బ్యానర్, వాల్‌రైటింగ్‌పై పోలీసులు విచారణను వేగవంతం చేశారు. సోమవారం గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, తొగుట సీఐ లతీఫ్, ఎస్సై లింగం వాల్‌రైటింగ్ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడే ఫార్మా కంపెనీకి సంబంధించి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌ను పిలిచి విచారించారు. అనంతరం తొగుట తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఫార్మా కంపెనీకి ఎన్ని ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు.. లీజ్ ఎప్పటి వరకు ఉందని తహసీల్దార్ శ్రీకాంత్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తొగుట సర్కిల్ కార్యాలయానికి చేరుకుని సంఘటనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గోడలపై వాల్‌రైటింగ్‌లు రాసింది మావోయిస్టులా.. లేక వారి పేరుతో ఎవరైనా మాజీ నక్సలైట్లా లేక, ఎవరైనా ఆకతాయిలు ఈ పనులు చేశారా? అనే కోణంలో పోలీసులు కూపీ లాగుతున్నట్లు సమాచారం. ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో మావోయిస్టుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతూ బ్యానర్‌లు, వాల్‌రైటింగ్ వెలియడంతో సమీప గ్రామాల ప్రాంత ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనలకు గురవుతున్నారు. ఈ విషయమై గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డిని సంప్రదించగా హెటిరో ఫార్మా కంపెనీ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని తెలిపారు.



పెద్దమాసాన్‌పల్లిలో బ్యానర్, వాల్‌రైటింగ్ వెలిసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

● కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 11: ఆత్మవిశ్వాసంతో.. ఆకాశమే హద్దుగా మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని కలెక్టర్ మను చౌదరి తెలిపారు. వివక్ష చూపకుండా అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలను వారికి ఇష్టమైన రంగాల్లో చిన్నప్పటి నుంచే ప్రోత్సహించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధులశాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం వారు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ముందుగా మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తన ఎదుగుదలకు అమ్మ ప్రోత్సాహం చాలా ఉందని చెప్పారు. సివిల్స్ వైపు అడుగులు వేయడానికి తన అమ్మ ఇచ్చిన మోటివేషన్, గైడెన్స్ కారణమని తెలిపారు. తన భార్య కూడా వ్యక్తిగత జీవితంలో పిల్లలను చూసుకుంటూ వైద్యవృత్తిలో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అనంతరం ఉత్తమ అంగన్‌వాడీ టీచర్స్, అంగన్‌వాడీ హెల్పర్స్‌ను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి సరోజ, డీపీవో దేవకీదేవి, జిల్లా పౌరసరఫరాల అధికారిత నూజ, సెట్విన్ అధికారి అమీనా, ఇతర శాఖల అధికారులు ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ మను చౌదరి

ఎన్నికలకు సన్నద్ధమవ్వాలి

కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధరణి పెండింగ్ దరఖాస్తులు, భూసేకరణ, రానున్న లోక్‌సభ ఎన్నికల సన్నద్ధంపై చర్చించి తగు ఆదేశాలు జారీ చేశారు. చిన్నకోడూరు మండలంలో రైల్వేలైన్ ఏర్పాటు భూసేకరణ, మెదక్ ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణంలో కోహెడ మండలం బస్వాపూర్, హుస్నాబాద్ మండలం పందిళ్ల వద్ద భూసేకరణ త్వరగా పూర్తిచేయాలన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో వసతులను సరి చేసుకోవాలని, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ అవసరమైన చోట ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. సమావేశంలో హుస్నాబాద్ ఆర్డీవో బెన్‌షాలెం, కలెక్టరేట్ ఏవో రెహమాన్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.



క్లబ్బులో.. గబ్బు

● సిద్దిపేట నడిబొడ్డున జోరుగా పేకాట


● మొత్తంగా 13 టేబుళ్లలో ...

● ఇతర జిల్లాల నుంచి సిద్దిపేట పేకాట క్లబ్‌కు

● రూ.లక్షల్లో చేతులు మారుతున్న వైనం

● గెలిచిన వారి నుంచి 4 నుంచి 10 శాతం వసూల్

● చోద్యం చూస్తున్న అధికారులు



క్లబ్ వద్ద జనం సందడి



గ్రౌండ్ ఫ్లోర్‌లో గ్రీన్‌మ్యాట్ కట్టి పేకాటను నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దిపేట టౌన్, మార్చి 11 : కాలక్షేపం కోసం ఏర్పాటు చేసుకున్న ఆ క్లబ్‌లోకి పేక ముక్కలు వచ్చి చేరడంతో అది కాస్త గబ్బుగా మారిపోయింది. సిద్దిపేట నడిబొడ్డున ఉన్న క్లబ్‌లో కొంతకాలంగా పత్తాలాట (పేకాట) మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నట్లుగా సాగుతున్నది. గతంలో కూడా ఇదే తరహాలో పేకాట ఆడుతుండగా పోలీసులు ఏకకాలంలో దాడులు చేసి చర్యలు తీసుకున్నారు. కొంతకాలం నుంచి మళ్లీ పేకాట మొదలుపెట్టడంతో జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, వరంగల్ జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా పేకాటరాయుళ్లు ఇక్కడికి వస్తుండడంతో క్లబ్‌లో వాతావరణం సందడిగా మారుతుంది. ప్రతి రోజు పేకాటరాయుళ్లతో క్లబ్‌లో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. పేకముక్కలు ఆడేందుకు రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు, యువకులు, భారీ సంఖ్యలో వస్తుండటం గమనార్హం.

అంతస్తును బట్టి ఆట

సిద్దిపేట కేంద్రంగా నిర్వహిస్తున్న క్లబ్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో 5 టేబుళ్లు, మొదటి అంతస్తులో 8 టేబుళ్లు, రెండో అంతస్తులో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని 5 టేబుళ్లలో రూ.వెయ్యి నుంచి రూ.10వేల వరకు, మొదటి అంతస్తులో రూ.10వేల నుంచి 20 వేలు, రెండవ అంతస్తులో రూ. 25 వేలు, ఆపైనే డబ్బు పెట్టి పేకాట ఆడుతున్నారు. కొందరు డబ్బు కట్టి, మరికొందరు ఆన్‌లైన్ ద్వారా చెల్లించి పేకాట ఆడుతున్నారు. ఉదయం 10:30 నుంచి రాత్రి వరకు సిద్దిపేటకు చెందిన వారికి, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారికి మధ్యాహ్నం 3 గంటల నుండి క్లబ్‌లోనికి అనుమతిస్తున్నట్లు సమాచారం. ఇక వారికి తాగడానికి నీరు, స్నాక్స్, సిగరెట్స్ ఇలా అన్ని క్లబ్ లోపల ఉండేలా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. అనుమతి లేకుండా క్లబ్ లోపలికి ఇతరులు వెళ్లకుండా ఇద్దరు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేశారంటే పేకాట ఎంత స్థాయిలో జరుగుతుందో అర్థమవుతున్నది.



పేకాట ఆడుతున్న దృశ్యం

క్లబ్‌కు 4-10 శాతం ముట్టజెప్పాల్సిందే

పేకాటలో గెలిచిన వారి నుంచి క్లబ్ ఆదాయం పెంచేందుకు 4 నుంచి 10 శాతం మేరకు వసూలు చేస్తున్నారు. క్లబ్‌లో పేకా ట ఆడాలంటే గ్రౌండ్ ఫ్లోర్‌లోని కార్యాలయంలో ప్రత్యేకంగా తయారు చేసిన కాయిన్స్ తీసుకోవాలి. రూ.వెయ్యికి రూ.10కాయిన్, రూ.2వేలకు రూ.20కాయిన్, రూ.50వేలకు రూ.50 కాయిన్‌ను ఇస్తున్నారు. రమ్మీ ఆటలో గెలిచిన వారు ఆ కాయిన్లను తీసుకుని కార్యాలయంలో చూపిస్తే నగదు లేదంటే ఆన్‌లైన్‌లో డబ్బు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. ఇలా చెల్లించేప్పుడే అందులో నుంచి 4-10 శాతం వరకు మైనస్ చేసి ఇస్తున్నారు. ఇలా రోజులో క్లబ్‌కు రూ.2లక్షల నుంచి రూ.4 లక్షల మేరకు ఆదాయం వస్తున్నట్లు తెలిసింది.

గతంలో కూడా ఫిర్యాదులు

సిద్దిపేటలోని ఆ క్లబ్‌లో గతంలో అధికారులకు పలువురు బాధితులు ఫిర్యాదులను చేశారు. పేకాటలో రూ.లక్షల్లో డబ్బు పోగొట్టుకున్నవారు కుటుంబసభ్యులతో పాటు పోలీసులను ఆశ్రయించిన సందర్భాలున్నాయి. అప్పుడు పోలీసులు దాడులు చేసి పేకాట జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు మళ్లీ యథావిధిగా కొనసాగుతుండడం గమనార్హం. ఇలాగే కొనసాగితే అనేక కుటుంబాలు రోడ్డున పడే అవకాశాలూ లేకపోలేదు.



జోరుగా సాగుతున్న పేకాట



క్లబ్‌కు చెందిన ఫంక్షన్‌హాల్‌లో పార్క్ చేసిన పేకాట రాయుళ్ల వాహనాలు

ఫంక్షన్‌హాల్‌లో పార్కింగ్

క్లబ్‌లో పేకాట ఆడేందుకు ఇతర జిల్లాల నుంచి వస్తున్న వారికి మొదట క్లబ్‌లోనే కారు పార్కింగ్ చేసుకునేలా నిర్వాహకులు అనుమతిచ్చారు. కొన్నిరోజులుగా క్లబ్ చెందిన ఫంక్షన్‌హాల్‌లో పార్కింగ్ చేస్తున్నారు. పేకాట ఆడేందుకు వచ్చిన వారు ముందుగా క్లబ్ వద్ద దిగి లోనికి వెళ్తారు. డ్రైవర్ నేరుగా కారును ఫంక్షన్‌హాల్ పార్కింగ్ చేస్తాడు. పేకాట ముగిసిన తర్వాత కారు యజమాని ఫోన్ చేయగానే డ్రైవర్ వెళ్లి పికప్ చేసుకుంటున్నాడు. క్లబ్‌లో ఎక్కువగా కార్లను పార్క్ చేస్తే ఎవరికైనా అనుమానం రావొచ్చనే ఉద్దేశంతో ఇలా ప్లాన్ చేసి పేకాటను ప్రోత్సహిస్తున్నారు.

అధికారుల తీరుపై అనుమానాలు!

సిద్దిపేట పట్టణం నడిబొడ్డున, కూతవేటు దూరంలోనున్న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతంలో ఈ తంతంగం నడుస్తున్నా ఏం పట్టింపులేనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. జోరుగా సాగుతున్న పేకాటపై పోలీసుల నిఘా ఏమైంది? అంటూ పలువురు పట్టణవాసులు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు, పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు చేసి అనేక కుటుంబాలు రోడ్డున పడకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



క్లబ్‌లో పేకాట ఆడేందుకు వెళ్లిన ఓనర్‌ను పికప్ చేసుకునేందుకు వేచి ఉన్న కారు

మల్లగుల్లాలు


ఇందిర గెలిచిన చోట కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై తర్జనభర్జన

● సవాల్‌గా మారిన మెదక్ పార్లమెంట్ స్థానం

● గతంలో లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో హస్తందే హవా

● 2004 నుంచి బీఆర్ఎస్‌కు కంచుకోట

● అసెంబ్లీ ఎన్నికలో గులాబీదే ఆధిపత్యం



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 11: నలభై ఏళ్ల కిందట దివంగత ప్రధాని ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పుడు అభ్యర్థి ఎంపిక కోసం కాంగ్రెస్ పార్టీ మల్లగుల్లాలు పడుతున్నది. గతంలో కొన్ని దశాబ్దాల పాటు ఈ ప్రాంతం కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచింది. 1979-84 మధ్యకాలంలో దివంగత ఇందిరాగాంధీ మెదక్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి, ప్రధానిగా కొనసాగారు. ఆ తర్వాత కాలంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దివంగత మాజీ మంత్రి ఎం.బాగారెడ్డి రెండు దశాబ్దాలు మెదక్ పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. తర్వాతి కాలంలో తెలంగాణ ఉద్యమం మొదలవడంతో కాంగ్రెస్‌కు ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి.

బీఆర్ఎస్‌కు వరుస విజయాలు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పాటైన అప్పటి టీఆర్ఎస్ పార్టీ 2004 ఎన్నికలలో కాంగ్రెస్‌తో పొత్తుతో కుదుర్చుకున్నది. ఆ ఎన్నికలలో ఇక్కడి నుంచి టీఆర్ఎస్(బీఆర్ఎస్) అభ్యర్థి, దివంగత ఆలె నరేంద్ర గెలుపొందారు. ఆ తర్వాత పొత్తు లేకపోయినా 2009, 2014, 2019 ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ విజయం సాధిస్తూ వచ్చింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పడిన అనంతరం పదేళ్ల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయిందన్న విమర్శలకు ఆ పార్టీ దీటైన జవాబిచ్చింది. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టింది. ఆ పార్టీకి వచ్చే నెలలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలు సవాల్‌గా నిలిచాయి. అందుకే మెదక్ పార్లమెంట్ నుంచి పోటీ చేసే అభ్యర్థిని ఎంపిక చేయడం కోసం తర్జనభర్జన పడుతున్నది.

కేసీఆర్, హరీశ్‌రావును ఎదుర్కొనేదెవరు?

గతంలో కాంగ్రెస్‌కు బలంగా ఉన్న మెదక్ పార్లమెంట్ తెలంగాణ ఉద్యమం ఫలితంగా బీఆర్ఎస్‌కు పెట్టని కోటగా మారింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలలోనూ మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఐదింటిలో ఆ పార్టీ గెలిచింది. అంతేకాక ఈ పార్లమెంట్ నియోజకవర్గంలోనే ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఉన్నారు. వీరిని ఎదుర్కొని ఈ నియోజకవర్గంలో విజయం సాధించడం కోసం కాంగ్రెస్ దీటైన అభ్యర్థిని ఎంపిక చేయాలని భావిస్తున్నది.

టికెట్ కోసం మైనంపల్లి, నీలం ప్రయత్నాలు

మెదక్ పార్లమెంట్ టికెట్ కోసం ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేరు వినవస్తున్నది. ఆయన గతంలో మెదక్ అసెంబ్లీ నుంచి ప్రాతినిధ్యం వహించగా, ప్రస్తుతం ఆయన కుమారుడు రోహిత్‌రావు ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. పైగా హన్మంతరావుకు ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో విస్తృత పరిచయాలున్నాయి. మైనంపల్లి హన్మంతరావు అభ్యర్థి అయితే విజయావకాశాలు ఉంటాయని స్థానిక కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. కాగా బీసీ నాయకుడైన పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన నీలం మధు కూడా కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలలో ఆయన పటాన్‌చెరు నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తే నియోజకవర్గంలో బీసీలందరూ మద్దతు ఇచ్చే అవకాశాలుంటాయని మధు పార్టీ నాయకత్వానికి వివరించినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం కొంతకాలంగా వీరిద్దరి పేర్లు మాత్రమే వినిపిస్తున్నాయి. వీరిద్దరిలో ఎవరిని ఎంపిక చేస్తుంది? గులాబీ కోటలో విజయం సాధిస్తుందా? అన్న

మల్లన్న ఆలయ బుకింగ్ ఆదాయం రూ.55లక్షలు

కొమురవెల్లి, మార్చి 11 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బుకింగ్ ఆదాయం మూడు రోజులకు గాను రూ.55,18,026 సమకూరినట్లు ఆలయ ఈవో బాలాజీశర్మ సోమవారం తెలిపారు. మహాశివరాత్రి పురస్కరించుకుని 8వ తేదీన రూ.16,54,043, 9వ తేదీన రూ.16,11,232, 10వ తేదీన రూ.22,52,751 ఆదాయం సమకూరింది. పట్నాలు, బోనాలు, ప్రసాదాల విక్రయం, శీఘ్ర, అతి శీఘ్ర, ప్రత్యేక దర్శనాలు, స్వామి వారికి అర్చన, అభిషేకం ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.



కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

సమస్యలు విని.. భరోసా కల్పించి

7లో

● ప్రజావాణికి వెల్లువెత్తిన విజ్ఞప్తులు

● మొత్తంగా 59 వినతులు

వేసవి కాలం.. జరభద్రం!

● వడదెబ్బ తగిలే అవకాశం.. ● జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు 7లో

అంతర్ జిల్లాస్థాయి కబడ్డీలో విజేత చెక్కపల్లి జట్టు



టోర్నమెంట్ విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

హుస్నాబాద్‌రూరల్, మార్చి 11: మండలంలోని పోతారం(ఎస్)లో మూడు రోజులపాటు నిర్వహించిన అంతర్ జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన కబడ్డీ టీం టోర్నమెంట్ కప్‌ను సొంతం చేసుకున్నది. మూడు రోజులుగా నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్‌లో 56 జట్లు పాల్గొనగా, ఫైనల్ మ్యాచ్‌లో కేకేసీ పోతారం(ఎస్), చెక్కపల్లి కబడ్డీ టీంలు తలపడ్డాయి. ఫ్లడ్ లైట్స్ వెలుగుల్లో ప్రో కబడ్డీ పోటీలను తలపించే విధంగా నిర్వహించిన ఈ పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పోటీల్లో చెక్కపల్లి టీం ప్రథమ బహుమతిగా రూ. 20 వేల నగదును సొంతం చేసుకుంది. ద్వితీయ బహుమతిగా రూ. 15 వేలు పోతారం(ఎస్)కు చెందిన కేకేసీ జట్టు దక్కించుకున్నది. తృతీయ స్థానంలో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ రూ. 10వేల నగదు, నాలుగో స్థానంలో నిలిచిన మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ జట్టు రూ. 5 నగదును సొంతం చేసుకుంది. విజేతలకు కప్‌తో పాటు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో కబడ్డీ క్లబ్ మేనేజర్ మడక క్రిష్ణ, టోర్నమెంట్ దాతలు శంకరయ్య, మంజులారెడ్డి, మాజీ సర్పంచ్ బత్తిని సాయన్న, ఎంపీటీసీ శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



భద్రతాదళాలతో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

హుస్నాబాద్, మార్చి 11: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం సాయంత్రం హుస్నాబాద్ పట్టణంలో కేంద్ర భద్రతాదళాలు స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించాయి. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి మల్లెచెట్టు చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా మీదుగా ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. కార్యక్రమంలో ఏసీపీ సతీష్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు మహేష్, వివేక్, తిరుపతి తదితరులు ఉన్నారు

వైభవంగా స్వామివారి రథోత్సవం


రథోత్సవంలో భక్తులు

ఝరాసంగం, మార్చి 11: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మహాశివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. రథాన్ని వివిధ రంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మొదట ఆలయ గర్భగుడిలోని స్వామివారికి అభిషేకం, పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ప్రతిష్ఠించి బసవన్న ఆలయం వద్దకు తీసుకెళ్లారు.ఇక్కడ విగ్రహాలను రథంలో ఉంచి డప్పుచప్పుళ్లు, టపాసులు పేల్చుతూ ఊరేగింపు చేపట్టారు. ఈ ఊరేగింపు కక్కరవాడ శివారులోని బసవేశ్వర ఆలయం వరకు కొనసాగింది. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ అధికారులు, ఆలయ సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

'పౌర సరఫరాల శాఖ పనితీరు ఆదర్శంగా ఉండాలి'

మెదక్, మార్చి 11: జిల్లాలో పౌర సరఫరాల శాఖ పనితీరు ఆదర్శంగా ఉండాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఖరీఫ్ 2023-24 బియ్యం డెలివరీ, రబీ 2022-23 టెండర్ అయిన ధాన్యంపై మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 30లోగా పెండింగ్ బియ్యం డెలివరీ పూర్తి చేయాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎం హరికృష్ణ, డీఎస్‌వో బ్రహ్మారావు, అరవిందొరెడ్డి, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు చంద్రపాల్, ప్రణీతరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి పాల్గొన్నారు.

సమస్యలు విని.. భరోసా కల్పించి..

» ప్రజావాణికి వెల్లువెత్తిన విజ్ఞప్తులు

మెదక్ అర్బన్, మార్చి 11: కలెక్టరేట్లలో నిర్వహిస్తున్న ప్రజావాణికి వినతులు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో తొలిసారి మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి బాధితులకు భరోసా కల్పించేలా సాగింది. జిల్లా అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారు. వారి నుంచి దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్, వారి విన్నపాలను ఆలకించారు. పరిష్కారానికి అవకాశ మున్న ఆర్జీలను సంబంధిత అధికారులకు అందజేశారు. బాధితులు ఒకే సమస్యపై పదేపదే ప్రజావాణికి రాకుండా శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రజావాణికి 100 దరఖాస్తులు రాగా, అందులో రెవెన్యూశాఖ 35, డీఆర్‌డీవో 11, ఇతర శాఖలకు సంబంధించిన 54 వచ్చాయని తెలిపారు. ఇంకా పెండింగ్‌లో 250 దరఖాస్తులు ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి: మెదక్ ఎస్పీ

మెదక్ అర్బన్, మార్చి 11: పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డా. బాలస్వామి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాయలంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నంచి ఆర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఆర్జీలు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించండి

సంగారెడ్డి రూరల్, మార్చి 11: సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి బాధితులు పోటెత్తారు. కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఆర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ఇక్కడికి వస్తారని అన్నారు. ఆర్జీలను అధికారులు పరిష్కరిస్తే, ప్రజావాణిపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. కంది మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన సత్యమ్మ తన భర్త మృతి చెందాడని, అతని పేరు మీద ఉన్న భూమిని పౌతి మార్పులు చేసి పట్టా పాస్ బుక్కులు ఇప్పించాలని విన్నవించుకున్నారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మధ్యలోని శ్మశానవాటికను తొలగించాలని గ్రామానికి చెందిన అంజిరెడ్డి ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో పంటి (డెంటల్) డాక్టర్‌ను నియమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ కోరారు. హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి గ్రామంలో గ్రామకంఠం భూమి ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన ఆశన్నగౌడ్, సాయాగౌడ్, హరీష్‌గౌడ్‌లు కోరారు. వీటితో పాటు పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, భూ సమస్యలను పరిష్కరించాలని ఆర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో వసంతకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

ప్రజావాణికి 59 వినతులు

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 11: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి దోహదపడుతుందని, ఆర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణిలో భూసంబంధిత, పింఛన్లు ఇతర మొత్తం కలపి 59 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ జగదేవ్ ఆర్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్జీలు స్వీకరిస్తున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మోదీ నాయకత్వంలో విశ్వగురువుగా భారత్

- కేంద్రంలో బీజేపీ హ్యాట్రిక్ ఖాయం
- 400 ఎంపీ స్థానాలే లక్ష్యం
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత మోదీదే
- కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్


కందిలో నిర్వహించిన మేధావుల సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్

కంది, మార్చి 11: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం విశ్వగురువుగా అభివృద్ధి చెందిందని కేంద్ర సాంస్కృతిక, న్యాయశాఖ సహాయమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కంది శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా బిల్లును పాస్ చేయించిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. అతి త్వరలో 33 శాతం మంది మహిళలకు ఎంపీ సీట్లు కేటాయిస్తామన్నారు. మోదీ ప్రధానిగా ఉంటేనే పరిశ్రమలు బాగుపడతాయని, వ్యవసాయరంగం మరింతగా అభివృద్ధి చెందుతుందని, దేశం పటిష్ఠంగా ఉంటుందని ఆయన తెలిపారు. చంద్రయాన్ సక్సెస్‌తో మన అంతరిక్ష టెక్నాలజీ ఎల్లలు దాటిందన్నారు. ప్రపంచదేశాలన్నీ భారత్ వైపే చూస్తున్నాయని, అంతగా టెక్నాలజీ పరిశోధనలు అభివృద్ధి చెందాయని కొనియాడారు. ఆయూష్ ద్వారా కోవిడ్ సమయంలో దేశం మొత్తానికి వ్యాక్సిన్ అందించి మోదీ అందరిలో ధైర్యాన్ని నింపారని గుర్తుచేశారు. 370 ఆర్టికల్ రద్దు చేయడం దేశం గర్వించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. అనేక కొత్త చట్టాలు, ఎన్నో సంస్కరణలు చేసిన మోదీ పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతుందన్నారు. దేశ ఆర్థికవ్యవస్థను 5 ట్రిలియన్లకు పెంచడమే లక్ష్యంగా ప్రధాని కృషి చేస్తున్నారని వివరించారు. రానున్న రోజుల్లో ప్రాంతీయ భాషను న్యాయస్థానాల్లో అమలు చేస్తామన్నారు. కేంద్రంలో ఈసారి కూడా బీజేపీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 400 ఎంపీ స్థానాల గెలుపొందడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలన్నారు. ప్రతీ గడపకు మోదీ దేశానికి చేసిన అభివృద్ధి పనులు వివరించాలని కోరారు. ఈ సదస్సులో ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకులు పులిమామిడి రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ వైద్యనాథ్, డాక్టర్ రాజుగౌడ్, నాగరాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

- కుదుట పడని బాలుడి ఆరోగ్యం
- పోలీసులను ఆశ్రయించిన బాధిత కుటుంబం
- ఉపాధ్యాయుడికి అండగా ఉపాధ్యాయ సంఘాలు


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు

టేక్మాల్, మార్చి 11: విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన టేక్మాల్‌లో చోటు చేసుకున్నది. మండలంలోని ధనుర గ్రామానికి చెందిన కుమార్, అనిత దంపతుల కుమారుడు మనోహర్(6) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చంద్రప్రకాష్ రెండునెలల క్రితం బాలుడిని చితకబాదడంతో కాలు విరిగి నడవలేని స్థితిలో ఉండగా.. తల్లిదండ్రులు సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఇచ్చి.. విద్యార్థికి పూర్తిగా నయం అయ్యేవరకు తాను ఖర్చులు భరిస్తానని, అధికారులకు ఫిర్యాదు చేయొద్దని కోరాడు. అయితే విద్యార్థి ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడా రెండు నెలలుగా చికిత్స చేయించినా నడవలేని స్థితిలో ఉండడంతో తమకు న్యాయం చేయాలని బాలుడికి కుటుంబీకులు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఉపాధ్యాయుడికి సమాచారం అందివ్వగా.. ఆయనకు అండగా ఉపాధ్యాయ సంఘాలు రాజీకి ప్రయత్నాలు చేస్తున్నట్లు బాధిత కుటుంబం పేర్కొన్నది.

ఇంటర్ పరీక్షల్లో ఇద్దరిపై మాల్ ప్రాక్టీస్ కేసు: డీఐఈవో

సంగారెడ్డి అర్బన్, మార్చి 11: ఇంటర్మీడియట్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదైంది. జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఇద్దరిని డిబార్ చేసినట్టు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కాగా సోమవారం ఇంటర్ ఫస్టియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 52 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 19,961 మందికి 19,017 మంది హాజరుకాగా, 944 మంది గైర్హాజరయ్యారు. 95.27 హాజరు శాతం నమోదైంది.

వ్యవసాయ మార్కెట్‌లో కొలువుదీరిన పాలకవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గం

జహీరాబాద్, మార్చి 11: జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం సోమవారం కొలువుదీరింది. ముందుగా వ్యవసాయ మార్కెట్ కార్యాలయానికి నూతనంగా ఎన్నికైన చైర్మన్ ఆగమ సాయిచరణ్ రావడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు, నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అందులో భాగంగా చైర్మన్‌ను చైర్మన్ కార్యాలయానికి తీసుకెళ్లి శాలువాలు, పూలమాలతో అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అధికారి చాయాదేవి, స్థానిక ద్వితీయశ్రేణి కార్యదర్శి అనిల్‌బాబు నూతనంగా ఎన్నికైన చైర్మన్ ఆగమ సాయిచరణ్, సభ్యులతో సమావేశమై మార్కెటింగ్‌శాఖ విధివిధానాల గురించి వివరించారు. మార్కెట్ కార్యాలయం ముంగిట నూతనంగా ఎన్నికైన చైర్మన్‌కు క్రేయిన్‌తో గజమాలను వేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సుభాష్‌గంజ్‌లో గల వేదికపై చైర్మన్, సభ్యులతో కలిసి జిల్లా వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అధికారి చాయాదేవి ప్రమాణ శ్రీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ ఆగమ సాయిచరణ్ మాట్లాడుతూ జహీరాబాద్ వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తల్లిదండ్రులు, మాజీమంత్రి డా.చంద్రశేఖర్, ప్రమీల, జిల్లా నాయకుడు ముల్తానీపాటిల్, జడ్పీటీసీ నాగిశెట్టిరాథోడ్, నాయకులు నర్సింహారెడ్డి, కండెం నర్సింహులు, హుగ్గెల్లి రాములు పాల్గొన్నారు.

చల్లంగ చూడు తల్లి..

● ముగిసిన ఏడుపాయల జాతర

పాపన్నపేట, మార్చి 11: వెళ్లొస్తాం.. వచ్చే ఏడాది మళ్లొస్తాం.. చల్లంగా చూడు తల్లి అంటూ దుర్గమ్మను దర్శించుకున్న భక్తులు జాతర నుంచి సోమవారం తిరుగు ప్రయాణమయ్యారు. మహా శివరాత్రి సందర్భంగా ప్రారంభమైన ఏడుపాయల జాతర ముగిసింది. మూడు రోజులపాటు జరిగిన జాతర జిల్లాస్థాయి అధికారుల సమన్వయంతో ప్రశాంతంగా జరిగింది. జాతరలో 50కి పైగా పిల్లలు తప్పిపోగా పోలీసులు వారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. జాతరలో అక్రమంగా మద్యం అమ్ముతున్న 5 బెల్ట్‌షాప్‌లపై కేసులు నమోదు చేశారు. ఆదివారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన రవి దుర్గమ్మ దర్శనానికి వచ్చి ఏడుపాయల్లోని రెండో బ్రిడ్జి వద్ద నీట మునిగి చనిపోయాడు. ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, పారిశుధ్య కార్మికులు జాతరలో సేవలందించారు.

ఆదాయం రూ.61..18 లక్షలు

గత ఏడాది కంటే రూ.2లక్షల 74వేలు అదనం

ఏడుపాయల వనదుర్గ భవానీ జాతర ముగిసిన నేపథ్యంలో భక్తులు సమర్పించిన కానుకలను, హుండీలను లెక్కించారు. మహాజాతర సందర్భంగా రూ.61లక్షల 18వేల ఆదాయం సమకూరినట్లు చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి వెల్లడించారు సోమవారం గోకుల్ షెడ్‌లో హుండీలో లెక్కింపు చేపట్టారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్ ఇన్‌స్పెక్టర్ రంగారావు పర్యవేక్షణలో భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు హుండీలను లెక్కించగా, 14 రోజులకు గానూ రూ. 24 లక్షల 75 వేల 366 నగదు వచ్చిందన్నారు. ఒడి బియ్యం ద్వారా రూ. 77వేల 950, కేశ ఖండన ద్వారా రూ. 59వేల 250, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 9 లక్షల 95 వేల 720 ఆదాయం వచ్చింది. లడూడ విక్రయం ద్వారా రూ. 17 లక్షల 70, పులిహోర ద్వారా రూ. 7 లక్షల 39 వేల 900ల ఆదాయం వచ్చింది. గతేడాది కంటే ఈ జాతరకు రూ. 2 లక్షల 74 వేల 403లు అదనంగా ఆదాయం సమకూరినట్లు ఆలయ చైర్మన్ బాలాగౌడ్ వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపులో పాలకమండలి సభ్యులు వెంకటేశం, మనోహర్, యాద గౌడ్, బాగా రెడ్డి, శ్రీనివాస్ రావు, సాయిలు, పెంటయ్య, చక్రపాణి, రఘువీర్, మోహన్ రావు, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

కల్హేర్‌లో అలరించిన కుస్తీ పోటీలు

కల్హేర్, మార్చి 11: మండల కేంద్రమైన కల్హేర్‌లోని భద్రప్పస్వామి ఆలయ మహాశివరాత్రి ఉత్సవాల ఆఖరు రోజైన సోమవారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. ఈ సందర్భంగా సంగారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు చెందిన మల్లయోధులే కాకుండా సరిహద్దున ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. ఆఖరి కుస్తీలో విజయం సాధించిన మల్లయోధుడికి 5 తులాల వెండి కడియం, రూ.1111 నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోచయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు ముదాళం వీర్‌శెట్టి, పబ్బతి మహిపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన తహసీల్దార్

హత్నూర, మార్చి 11: 'ఉడికి ఉడకని అన్నం తినేది ఎట్లా..!' అనే శీర్షికన ఈనెల 9న ఆంధ్రజ్యోతి ప్రచురితమైన కథనానికి హత్నూర తహసీల్దార్ పర్వీన్ షేక్ స్పందించారు. మండల కేంద్రమైన హత్నూరలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సోమవారం సందర్శించి, విద్యార్థుల కోసం వండిన అన్నం, కూరగాయలను పరిశీలించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, లేనియెడల చర్యలు తప్పవని అక్కడి సిబ్బందిని హెచ్చరించారు.

వేసవి కాలం.. జరభద్రం..!

» వడదెబ్బ తగిలే అవకాశం.. » జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు

చిన్నకోడూరు, మార్చి 11 : అప్పుడే ఎండలు ముదురుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే మండిపోతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు. దీంతో జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. తాత్కాలిక ఉపశమనం కోసం జ్యూస్‌లు, కొబ్బరినీళ్లు, కూల్ డ్రింక్స్ తాగుతున్నారు. ఇంత చేసినా.. అత్యవసర పనులు, ఉద్యోగం, ఉపాధి కోసం బయటకు రాకుండా ఉండలేని పరిస్థితి. అయితే, ఎండలో తిరిగితే వడ దెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, పగటి పూట ఎండలో తిరగకూడదని, వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు..

- వడదెబ్బ తగిలిన వ్యక్తికి తీవ్రమైన జ్వరం, తల నొప్పి, బీపీ తగ్గిపోయి కళ్లు తిరిగి పడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.
- చర్మం ఎర్ర బడటం
- నాలుక తడి ఆరిపోవడం
- కొందరికి వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఉంటుంది.

ప్రథమ చికిత్స...

- వడ దెబ్బ తాకిన వ్యక్తిని ముందుగా ఎండలో నుంచి నీడలోకి చేర్చాలి.
- ఉప్పు కలిపిన నీటిని, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాగించాలి.
- తడి వస్త్రంతో చర్మం పై తుడవాలి.


శివ్వంపేట: శివ్వంపేటలో టబ్బులో ఆడుకుంటున్న బాలుడు

అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి...



వేసవి కాలంలో అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకూడదు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే తలకు టోపీ ధరించాలి, లేదా వెంట గొడుగు తీసుకెళ్లాలి. వడ దెబ్బ తగిలిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించి, వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలి.

-డాక్టర్ సరిత,
పీహెచ్‌సీ వైద్యురాలు, చిన్నకోడూరు

ముందస్తు జాగ్రత్తలు...

- మధ్యాహ్నం సమయంలో ఎండలో తిరగకూడదు.
- అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, లేదా రుమాలు ధరించాలి. వెంట గొడుగు తీసుకెళ్లాలి.
- నల్లని దుస్తులు ధరించకూడదు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న రైతులు

భూములు కోల్పోతున్నాం.. న్యాయం చేయండి

సిద్దిపేట అర్బన్, మార్చి 11 : ఫోర్ వే లైన్‌కు సంబంధించి భూములను కోల్పోతున్నాం.. మాకు న్యాయం చేయండి సారూ అంటూ సిద్దిపేట అర్బన్, రూరల్ మండలాలకు చెందిన సుమారు వంద మంది రైతులు కాంగ్రెస్ నాయకులు హరికృష్ణ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేటలోని గాడిచర్లపల్లి గొర్ల షెడ్డు చెక్కులను సంబంధిత రైతులకు అందజేసేలా చూడాలని కలెక్టర్‌ను కాంగ్రెస్ నాయకులు కోరారు.

సంక్షేమపథకాలు ప్రజలకు అందేలా చూడాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్నఎంపీపీ సంధ్య

దౌల్తాబాద్, మార్చి 11: కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ గంగాధరి సంధ్య తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభలో ముందుగా ఆయా శాఖల అధికారులు తమ శాఖల నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులు దొర్లకుండా గ్రామాల్లో ప్రజలకు అర్థమయ్యేలా అధికారులు వివరించాలని సభలో కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేకాధికారులు ముందస్తు చర్యలను తీసుకోవాలన్నారు. గతంలో జరిగిన పనులపై సమీక్ష నిర్వహించి సమావేశాన్ని ముగించారు. జడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో వెంకటక్ష్మి, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అర్హులకు అందేనా?

● డాటా ఎంట్రీలో తప్పులతో ప్రజల్లో అనుమానాలు ● సవరణలకు అవకాశమిచ్చినా ఈకేవైసీ పేరిట తప్పని పాట్లు


చేర్యాల, మార్చి 11: ఆరుగ్యారంటీల పథకాలకు సంబంధించి దరఖాస్తుల డాటా ఎంట్రీలో తప్పులు చోటు చేసుకోవడంతో అర్హులైనవారు ఆందోళనకు గురవుతున్నారు. తమకు లబ్ధి చేకూరదేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం కింద ఆరుగ్యారంటీల పథకం అమలు కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి డాటా ఎంట్రీ చేయడానికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. ఒక్కో దరఖాస్తు నమోదుకు రూ.5చొప్పున పారితోషికం ఇస్తామని అధికారులు తెలిపారు. అయితే అవగాహన లోపమో లేక దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారో గానీ ఎంతోమందికి సంబంధించిన వివరాలు కంప్యూటర్లలో తప్పుగా నమోదయ్యాయి. దీంతో సవరణల కోసం ప్రభుత్వం అవకాశం కల్పించడంతో ప్రజలు తిరిగి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సాంకేతిక లోపాలు తలెత్తి అయోమయానికి గురవుతున్నారు.

వేలల్లో అందిన దరఖాస్తులు

ఆరు గ్యారంటీలకు సంబంధించి చేర్యాల మున్సిపల్ పరిధిలోని 12వార్డులలో 5,092, ఇతర 615, చేర్యాల మండలంలో 10వేలకుపైగా, కొమురవెల్లి మండలంలో 7,035, మద్దూరు, ధూళిమిట్ట మండలాలలో 9,900 ఆరుగ్యారంటీలు, ఇతర 3,200దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం దఫాలవారీగా ఆరు గ్యారంటీలు అమలుచేపడుతుండగా, ఇటీవల జీరో విద్యుత్ బిల్లులు, రూ.500కు గ్యాస్ సిలిండర్‌ను అమలు ప్రారంభించింది. కానీ డాటాఎంట్రీలో ఆధార్ కార్డు నంబరు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్, గ్యాస్ కనెక్షన్ తదితర వివరాలు తప్పుగా నమోదు కావడంతో గృహలక్ష్మీ పథకం ద్వారా 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కు జీరో బిల్లు రావడంలేదు. అంతేకాకుండా మహాలక్ష్మికి సంబంధించి గ్యాస్ కనెక్షన్ నంబరు లింక్ కాకపోవడంతో కలవరపడుతున్నారు.



చేర్యాలలో ప్రజాపాలన దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు(ఫైల్)



గ్యాస్ కనెక్షన్ అనుసంధానానికి తలెత్తుతున్న సర్వర్ ఎర్రర్

సవరణకు అవకాశం ఇచ్చినా...

ప్రజాపాలన దరఖాస్తుల నమోదులో లోటుపాట్ల సవరణలతో పాటు నూతన దరఖాస్తులకు ప్రభుత్వం ఇటీవల అవకాశం ఇచ్చింది. అందుకు ప్రతీ ఎంపీడీవో కార్యాలయంలో కౌంటర్లు ఏర్పాటుచేసింది. దీంతో ప్రజలు తమ దరఖాస్తుల పునఃపరిశీలన నిమిత్తం పరుగులుపెడుతున్నారు. రేషన్, గ్యాస్, బ్యాంకు ఖాతాలన్నింటికి ఆధార్ లింక్ ఉండటంతో దరఖాస్తులో ఆధార్‌నంబరు తప్పుగా నమోదు చేయడంతో విద్యుత్, గ్యాస్ రాయితీపొందని పరిస్థితి నెలకొన్నది. ఆధార్ నంబరు సవరణ చేయడంతో విద్యుత్ శాఖాధికారులు జీరోబిల్లు అందజేస్తున్నా, గ్యాస్ కనెక్షన్ నంబరు నమోదులో సాంకేతికలోపం తలెత్తి ఇబ్బందులుపడుతున్నారు.గ్యాస్ కంపెనీ డీలర్లు తమకేం సంబంధం లేదనిచెబుతుండగా, అధికారులు మాత్రం ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని చెబుతున్నారు.

ప్రస్తుత పరిస్థితి ఇలా..

చేర్యాల మున్సిపల్ పరిధిలో సోమవారం నాటికి 411, నూతన దరఖాస్తులు 53, కొమురవెల్లి మండలంలో 100, 82నూతన, మద్దూరు మండలంలో 85, ధూళిమిట్ట మండలంలో 144 చొప్పున దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మరిన్ని రోజులు కొనసాగనుండటంతో దరఖాస్తుదారుల సంఖ్య మరింతంగా పెరిగే అవకాశం ఉంది.

దరఖాస్తుల సేకరణ నిరంతర ప్రకియ

ప్రజాపాలన దరఖాస్తులో నెలకొన్న తప్పుల సవరణకు ప్రభుత్వం ఎలాంటి గడువు విధించలేదు. ఇది నిరంతర ప్రక్రియ. రేషన్‌కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబరుతో లింక్ చేయించుకున్న అనంతరం విద్యుత్ శాఖ అధికారులు జీరో బిల్లు ఇస్తున్నారు. సాంకేతికపరంగా తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు.

\- మహబూబ్ అలీ, చేర్యాల ఇన్‌చార్జి ఎంపీడీవో

కారు చెట్టును ఢీకొని యువకుడి దుర్మరణం



కృష్ణారెడ్డి(ఫైల్)

వర్గల్, మార్చి 11: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో గౌరారం గ్రామానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి గౌరారం గ్రామసమీపంలో చోటు చేసుకున్నది. గౌరారం ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌరారం గ్రామానికి చెందిన బోరెడ్డి కృష్ణారెడ్డి(20) అనే యువకుడు ఆదివారం రాత్రి స్విఫ్ట్ కారులో గౌరారం నుంచి వర్గల్‌కు డ్రైవింగ్ చేసుకుంటు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గౌరారం గ్రామ సమీపంలోకి రాగానే కారు అతి వేగంగా నడపడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో కృష్ణారెడ్డి తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబీకులు కృష్ణారెడ్డిని ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి భూపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆటోను ఢీ కొట్టిన డీసీఎం .. ఒకరికి తీవ్ర గాయాలు

కొండపాక, మార్చి 11: మండలంలోని వెలికట్ట శివారులో రాజీవ్ రహదారిపై ఆటోను డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కొండపాక గ్రామానికి చెందిన మదూరి రఘురాములు తన భార్యతో ఆటోలో సిద్దిపేటకు వైపు వెళ్తుండగా అదే దారిలో వస్తున్న డీసీఎం ఆటోను వెనక నుంచి ఢీ కొట్టింది. దీంతో ఆటో పల్టీ కొట్టి అందులో ప్రయాణిస్తున్న రఘురాములుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే టోల్ గేట్ అంబులెన్స్ సిబ్బంది చేరుకొని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుడంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

● ఇద్దరిపై కేసు నమోదు ● 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

మద్దూరు, మార్చి 11: ఉమ్మడి మండలంలోని కూటిగల్ రెడ్యానాయక్ తండాలో గుడంబా స్థావరాలపై సోమవారం జిల్లా టాస్క్ ఫోర్స్, చేర్యాల ఎక్సైజ్ శాఖాధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ.. రెడ్యానాయక్ తండాలో రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకోవడంతో పాటు మరో ఇద్దరి వ్యవసాయ బావుల వద్ద సుమారు 300 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చేర్యాల రామలింగేశ్వరాలయంలో చోరీ

చేర్యాల, మార్చి 11: చేర్యాల పట్టణం హనుమాన్‌నగర్ కాలనీలోని రామలింగేశ్వర ఆలయంలో చోరీ జరిగింది. హనుమాన్ ఉపాలయ మండప ఆవరణలోని హుండీని ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. హుండీలో సుమారు రూ.10వేల నగదు ఉండవచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ శ్రీను, ఎస్ఐ దామోదర్ ఆలయానికి చేరుకుని విచారణ చేపట్టారు.

డిపాజిట్ డబ్బు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న సబ్ పోస్టుమాస్టర్

● పోస్టాఫీసులో బాధితుడి ఆందోళన

హుస్నాబాద్, మార్చి 11: గడువు ముగిసి నాలుగు నెలలైనా ఫిక్స్ డిపాజిట్ చేసిన డబ్బును ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న హుస్నాబాద్ సబ్‌పోస్టు మాస్టర్ అంజయ్యపై సోమవారం హుస్నాబాద్‌కు చెందిన బాధితుడు బొలిశెట్టి సుధాకర్ ఆందోళనకు దిగాడు. హుస్నాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ అయిన బొలిశెట్టి సుధాకర్ తన భార్య పేరిట రూ. 40 వేలు డిపాజిట్ చేశారు. నవంబర్ 2023తో కాలపరిమితి ముగిసింది. డిపాజిట్ బాండ్‌పేపర్‌ను పోస్టుమాస్టర్‌కు అప్పగించి నాలుగు నెలలు గడిచినా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్నాడని సుధాకర్ తెలిపారు. రేపు మాపు అంటూ వాయిదాలు పెడుతున్నాడు తప్ప డబ్బు ఇవ్వడం లేదంటూ పోస్టుమాస్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. వారంలో డబ్బు ఇస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించాడు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మిరుదొడ్డి, మార్చి 11: పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని మిరుదొడ్డి ఎంపీపీ సాయిలు అన్నారు. సోమవారం మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో రంజాన్ పండుగ సందర్భంగా గ్రామంలో వివిధ సంఘాల, పార్టీల నాయకులతో హెడ్‌కానిస్టేబుల్ ప్రమోద్ ఆధ్వర్యంలో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యుడు హైమ్మద్, తాజామాజీ సర్పంచు బాల్‌రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ బాపు రెడ్డి తదితరులున్నారు.

● **చేర్యాల:** రంజాన్ ఉపవాస దీక్షలు ప్రశాంతంగా జరుపుకోవాలని చేర్యాల ఎస్ఐ దామోదర్ అన్నారు. రంజాన్ ఉపవాసదీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం రాత్రి చేర్యాల జామే మజీద్ కమిటీ ప్రతినిధులు ఎస్ఐ దామోదర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. తెల్లవారు జాము, సాయంత్రం వేళల్లో సైరన్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ

బెజ్జంకి, మార్చి 11 : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.5 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్ నిర్మాణానికి జడ్పీటీసీ కనగండ్ల కవిత సోమవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల నాయకులు రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మద్దూరు, మార్చి 11: మద్దూరు మండలం వంగపల్లిలో భూ అభివృద్ధి పనులను ఎంపీడీవో ఎస్ రాంమోహన్ సోమవారం సందర్శించి పరిశీలించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండే విధంగా చూడాలని ఫీల్డు అసిస్టెంట్లకు సూచించారు. నర్సరీతో డంపింగ్ షెడ్‌ను పరిశీలించారు. ఎండలు తీవ్రతరం కావడంతో ఉదయమే కూలీ పనులకు వచ్చే విధంగా చూసి తొందరగా పనులు ముగించుకోవాలని సూచించారు.

ఈటలను కలిసిన బీజేపీ నాయకులు



ఈటలకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న బీజేపీ మర్కుక్ మండల అధ్యక్షుడు

మర్కుక్, మార్చి 11: మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా సాయిరెడ్డి రాంరెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్‌ను ఆయన స్వగృహం శామీర్‌పేటలో మర్యాద పూర్వకంగా కలిశారు. వారితో పాటు మాజీ మండల అధ్యక్షులు రమేశ్‌గుప్తా, సుర్వి కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు



నంగునూరు: రాంపూర్ క్రాసింగ్ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

నంగునూరు, మార్చి 11: యాసంగి పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, వెంటనే కాలువల ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. పెద్దవాగులోకి సాగునీటిని విడుదల చేసి పంట పొలాలను రక్షించాలని డిమాండ్ చేస్తూ అక్కెనపల్లి, ఘణపూర్ గ్రామాలకు చెందిన సుమారు 50 మంది రైతులు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద సిద్దిపేట- హనుమకొండ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. తక్షణమే సాగు నీరు అందించి పంటలు ఎండిపోకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్ రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. సంబంధిత శాఖ అధికారులు వచ్చి హామీ ఇచ్చేంతవరకు ఆందోళన విరమించేదిలేదని రైతులు మొండికేశారు. ఇరిగేషన్ డీఈఈ చంద్రశేఖర్ అక్కడకు చేరుకొని సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. సుమారు అరగంట పాటు జరిగిన రాస్తారోకో తో రహదారి పై వాహనాలు నిలిచిపోయాయి. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, సొసైటీ చైర్మన్ కోల రమేష్‌గౌడ్ రైతుల ఆందోళనకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో రైతులు నాగేందర్, సత్యనారాయణరెడ్డి, విజేందర్‌రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, సుధాకర్, యాదగిరి, సదానందం, శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'తపాస్‌పల్లి రిజర్వాయర్‌తో చెరువులు నింపాలి'

కొమురవెల్లి, మార్చి 11 : తపాస్ పల్లి రిజర్వాయర్ నీటితో మండలంలోని చెరువులు, కుంటలు నింపి పంటలను ఆదుకోవాలని సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. పంపుల ద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపాలంటూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సత్తిరెడ్డి మాట్లాడుతూ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు అడుగంటాయని, దేవాదుల పైప్ లైన్ ద్వారా పంపులు ప్రారంభించి కాలువల ద్వారా మండల వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు నిండి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



కల్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్/ సిద్దిపేటరూరల్, మార్చి 11: ఆధ్యాత్మికత, దైవ చింతనతో ఎంతో ప్రశాంతత లభిస్తుందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని గణేష్‌నగర్‌లో శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీరామ కల్యాణ మండపాన్ని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. కాగా సిద్దిపేట రూరల్ మండలంలోని రాంపూర్ గ్రామం మాజీ సర్పంచ్ వేల్పుల భిక్షపతి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సోమవారం భిక్షపతి కుటుంబ సభ్యులను సందర్శించి, పరామర్శించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



రిమ్మనగూడలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్, మార్చి 11: గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట డీసీసీ ప్రెసిడెంట్ తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడ గ్రామంలో సీసీ రోడ్ల పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. వారితో మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి మల్లారెడ్డి, టీపీసీసీ నాయకులు నాయిని యాదగిరి, పంజాల వెంకట్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, నల్లా శ్రీధర్, తోట ముత్యాలు, మాధవరావు, శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీపీ మోహన్, స్వామి ఉన్నారు.

కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వం

ములుగు, మార్చి 11: కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మామిడాల గ్రామానికి చెందిన తమ్మలి శ్రీనివాస్ ఎన్నిక కావడంతో నియామక పత్రాన్ని అందించారు. అనంతరం నర్సారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

సమస్యలను పరిష్కరించుకుందాం

● సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేట టౌన్, మార్చి11: సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకుందామని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన 10 అంశాలను ప్రవేశపెట్టగా, వాటిని సభ్యులు ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జంగిటి కనకరాజు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, విద్యుత్, పబ్లిక్ హెల్త్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

'గజ్వేల్-ప్రజ్ఞాపూర్'లో 16 తీర్మానాలకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, మార్చి 11: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మొత్తం 35 తీర్మానాలను ప్రవేశ పెట్టగా 16 తీర్మానాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించగా, మిగతావాటిని వాయిదా వేసినట్లు తెలిసింది. సమావేశంలో వైస్ చైర్మన్ జకీయోద్దీన్, కమిషనర్ గోల్కొండ నరసయ్య, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కుష్టు నివారణకు ఇంటింటి సర్వే

మద్దూరు, మార్చి 11: మండల కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు లద్నూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్టువ్యాధి నివారణకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్టు వైద్యాధికారి సువర్టసన్, సీహెచ్‌వో జి. శేషగిరి తెలిపారు. పీహెచ్‌సీల పరిధిలో ఆశాలు, ఏఎన్‌ఎంలు ఇంటింటి సర్వే చేపట్టారని తెలిపారు. ఇళ్లవద్దకు వచ్చే ఏఎన్ఎం, ఆశాలకు ప్రజలు సహకరించాలని వైద్యాధికారి కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

మద్దూరు, మార్చి 11: మద్దూరు మండలంలోని సలాఖ్‌పూర్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. పరస్పర క్షేమసమాచారాలను తెలుసకుని, ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహారామయ్య, శ్రీనివాస్, పృథ్వీరాజ్, సిద్ధిరాములు, శ్రీదర్, ఫారహత్ కౌసర్ ఉన్నారు.

యువతకు క్రీడా పరికరాలు అందజేత

కోహెడ, మార్చి 11: మండలంలోని నారాయణపూర్‌లో యూత్ కమిటీ సభ్యులకు ఎంపీ బండి సంజయ్ తరఫున క్రికెట్, వాలీబాల్ కిట్లను బీజేపీ నాయకులు సోమవారం అందజేశారు. రెండో విడత ప్రజాహిత యాత్ర సందర్భంగా ఎంపీ సంజయ్‌ను గ్రామానికి చెందిన యువకులు కలిసి క్రీడా పరికరాలు అందజేయాలని కోరారు. ఈ మేరకు క్రికెట్, వాలీబాల్ కిట్లను పంపించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడినవారికి కౌన్సెలింగ్



డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడినవారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ

గజ్వేల్, మార్చి 11: మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ కౌన్సెలింగ్ నిర్వహించారు. పట్టణంలోని పలు చౌరస్తాలలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా 45 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారికి సోమవారం గజ్వేల్ పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగిన ప్రమాదాల గూర్చి ఆడియో ద్వారా అవగాహన కల్పించారు. కాగా పట్టుబడినవారిని కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

'ఉపాధి హామీలో పొరపాట్లను సరిచూసుకోవాలి'

నంగునూరు, మార్చి 11 : ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన చిన్న పొరపాట్లు సరిచేసుకుంటూ అభివృద్ధికి కృషి చేయాలని అడిషనల్ డీఆర్డీవో పి.బాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం నంగునూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట జాతీయ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ, ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా గ్రామాల్లో జరిగిన ఈజీఎస్ పనులపై ఆర్పీలు నివేదికను చదివి వినిపించారు. ఈ ప్రజా వేదికలో అంబుడ్స్ మెన్ ఎండీ హారఫ్, విజిలెన్స్ అధికారి వి.ప్రభాకర్, జేక్యూసీ సంతోష్ రెడ్డి, ఎస్సార్పీ రంజిత్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, సూపరిండెంట్ ప్రభాకర్‌రావు, ఇన్‌చార్జి ఏపీవో, ఈజీఎస్ ఇంజనీరింగ్ కన్సల్ టెంట్ సర్వర్ పాషా, క్యూసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆర్పీలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'

గజ్వేల్, మార్చి 11: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శాసనమండలి సభ్యులు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి కోరారు. గజ్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ జేజాల వెంకటేశ్‌గౌడ్‌తో కలసి సోమవారం ఆయన ప్రారంభించారు. వారితో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, వైస్ ఎంపీపీ జెల్లే కృష్ణాగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవిందర్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి జాన్‌వెస్లీ, ఫాక్స్ సీఈవో బాలయ్య, గజ్వేల్ వ్యవసాయాధికారి నాగరాజు గుండు, డైరెక్టర్లు ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి: ఎస్ఐ

మర్కుక్, మార్చి 11: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని మర్కుక్ సబ్‌ఇన్‌స్పెక్టర్ మధుకర్‌రెడ్డి సూచించారు. సోమవారం మర్కుక్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ప్రస్తుత జీవన విధానంపై ఎస్ఐ అవగాహన కల్పించారు. పాఠశాలలకు వచ్చి వెళ్తున్న సమయంలో ఎవరైనా పోకిరీలు ఆగడాలు చేస్తే తన దృష్టికి తీసుకురావాలని, వారిని కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సుజాత ఉపాధ్యాయులు వందన, నరహరి, ప్రసాద్, శ్రీనివాస్‌రావు, రమణారావు, విద్యాధర్‌రెడ్డి, పద్మారెడ్డి, నరహరి, ప్రసాద్, సిద్దయ్య, నాగేశ్వర్‌రావు, సంతోష, రజని, భ్రమరాంబ, కృష్ణ, సీఆర్పీ నాయకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో

మహిళా దినోత్సవ వేడుకలు

కొండపాక, మార్చి 11: సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం కొండపాక ఆనంద నిలయంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. గైనకాలజిస్ట్ క్రాంతి, వృద్ధాశ్రమంలోని రత్నమాల అనే వృద్ధురాలికి సన్మానం చేశారు. వృద్ధులకు పలు రకాల ఆరోగ్య సమస్యలపై వైద్యులు సూచనలు ఇచ్చారు. పలువురు మహిళలకు దుస్తులు, అనాథ పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్, జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, మహిళా అధ్యక్షురాలు హేమలత, ప్రధాన కార్యదర్శి పబ్బ మాధవి, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటికి నిధులివ్వాలి

● మంత్రి పొన్నంకు ఎంపీపీ విజ్ఞప్తి

అక్కన్నపేట, మార్చి 11: గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎంపీపీ మాలోతు లక్ష్మీబీలునాయక్ కోరారు. సోమవారం అక్కన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో తాగు నీటి సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని, నీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలంటే గ్రామపంచాయతీలో నిధులు లేవని పంచాయతీ కార్యదర్శులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణకు మంత్రి స్పందించి మండలానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమీక్షలో ఎంపీడీవో జయరాం, మండల ప్రత్యేకఅధికారి మహేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మౌనిక, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్బీఐ చైర్మన్‌ను వెంటనే అరెస్టు చేయాలి

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన



చేర్యాల ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గజ్వేల్, మార్చి 11: ఎస్‌బీఐ చైర్మన్‌ను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గజ్వేల్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్టోరల్ బాండ్స్‌పై సీల్డ్‌కవర్లో సమాచారం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించినా, తమ వద్ద పూర్తి సమాచారం లేదని, నెల రోజుల సమయం కావాలని ఎస్‌బీఐ చైర్మన్ రిన సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి లొంగి సుప్రీంకోర్టుకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని విమర్శించారు. ఆయనవెంట సీపీఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు వెంకట్‌చారి, అఫ్జల్, నర్సింలు, మహేందర్, లక్ష్మణ్ ఉన్నారు.

● **చేర్యాల:** సుప్రీంకోర్టు ఆదేశానుసారం ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చేర్యాల ఎస్‌బీఐ (ఏడీబీ) బ్రాంచి ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వత్తాసు పలుకుతున్న ఎస్‌బీఐ చైర్మన్‌ను అరెస్ట్ చేయాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాళ్లబండి నాగరాజు, బండకింది అరుణ్‌కుమార్, ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

● **దుబ్బాక:** దేశంలో ఎన్నికల బాండ్ల విధానాన్ని బీజేపీ ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చి, అవినీతికి పాల్పడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్ ఆరోపించారు. సోమవారం దుబ్బాక ఎస్‌బీఐ బ్యాంకుముందు ఎన్నికల బాండ్ల వివరాలను తక్షణమే వెల్లడించాలని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మీనర్సయ్య, సాదిద్, రాజు, మహేష్, రవి, మల్లేశం, శివకుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.